# ఆ ఉత్తరం యింకా చదవలేదు

**టైం** ఉదయం తొమ్మిదిన్నర అవుతోంది. ఆడపిల్లల కాలేజిలో ఫిజిక్స్ లెక్చరర్ విద్యాధరి తన ఇంటి తలుపు తాళం వేసి, కాలేజికి వెళ్లడానికి టౌన్‌బస్ కోసం చూస్తూ స్టాపింగ్‌లో నిలబడ్డది. ప్రతిరోజూ సరిగ్గా తొమ్మిదిన్నరకి వచ్చే బస్సు యివాళ ఎందుకో రాలేదు. నిముషానికొకటీ, రెండూ చొప్పున వరుసగా రోడ్డు మీద పోతున్న రిక్షాలను పరధ్యానంగా చూస్తూ నిలబడిందామె.

అలా చూస్తున్న ఆమెకు ఒక రిక్షాలో తెల్లగా, పలుచగా వున్న పదిహేనేళ్ల పిల్లవాడు సూట్‌కేస్‌తో వెళ్లడం కన్పించింది. పరధ్యానంగా వుండటాన ఆమెకు ఒక్కక్షణం భ్రమ కల్గింది. తన కొడుకు కిరణ్ రిక్షాలో సూట్‌కేస్‌తో వస్తున్నాడనే అనుకుంది. ఆమె చూస్తుండగానే రిక్షా ఆమెను దాటిపోయింది. ఆమె నవ్వుకుంది. కిరణ్ యిప్పుడెట్లా వస్తాడు? దూరంగా గుంటూరులో రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో వున్నాడు. పదో క్లాసు పరీక్ష వ్రాయబోతున్నాడు. పరీక్షలు పూర్తయేవరకూ రాడు... కొంతసేపటికి మళ్లీ ఒక రిక్షాలో ఒంటరి యువకుడు సూట్‌కేస్‌తో వెళ్లడం కన్పించింది. ఈసారి ఆమె మనస్సు ఆత్రంతో భ్రమపడ్డది. ఇంతమంది టీనేజ్ అబ్బాయిలు సూట్‌కేసుల్తో రిక్షాల్లో ఆ రోడ్డులో వెళ్తుంటారని ఆమె యింతకు మునుపెన్నడూ గమనించలేదు. ఇవాళ నాకేమైంది? అనుకున్నది.

కిరణ్ పుట్టినప్పుడు విద్యాధరి భర్త తోటి లెక్చరర్లతో కలిసి త్రాగడం, పేకాడటం ప్రారంభించాడు. త్వరలోనే అది అదుపులో లేకుండా పోయింది. ఇద్దరి సంపాదనలూ చాలడం లేదు. ఒకనాడు విద్యాధరితో ఘర్షణపడ్డాడు. "నీకు అహంభావం పెచ్చుమీరి పోయింది. నీకు మనిషి విలువ తెలియదు. నీ ఉద్యోగం, నీ సంపాదన వుందిగా, నీ బ్రతుకు నీది. ఇహ నీ ముఖం చూడను" అని హూంకరించి యిల్లు వదిలి వెళ్లిపోయాడు. ఉద్యోగానికి రాజీనామా కాగితం కూడా పంపించేశాడు.

పాత పద్ధతులకు తలవంచి సొంత వ్యక్తిత్వాన్ని చంపుకోకపోవడం, అనుకున్న విషయాన్ని గట్టిగా చెప్పడం, ముక్కుసూటి ప్రవర్తన - యివి తన విశిష్ట లక్షణాలని కాలేజిలో చదివే రోజుల్లోనే గర్వంగా గుర్తించుకున్న విద్యాధరి ఆ పద్ధతినే పాటిస్తూ వచ్చింది యింతవరకూ. తన విజ్ఞానం మీద నమ్మకం, వృత్తి మీద వున్న భరోసాలతో

ఆత్మవిశ్వాసం గల ఆధునిక స్త్రీగా రూపొందిన ఆమె తన నిర్ణయమే సరైన దోవ అనీ, తన జీవితానికి తానే కర్తననీ అనుకున్నది. అతను వారం రోజులకు తిరిగి యింటికి వచ్చినప్పుడు "నిన్ను చూసి పిల్లవాడు కూడా చెడిపోతాడు. మా దగ్గర వుండకపోవడమే నీవు మాకు చెయ్యగల గొప్ప మేలు" అని స్పష్టం చేసింది.

తరువాత అతను ఆమెను బెదిరించాలని చూశాడు. కొడుకుని తీసుకెళ్లాలని ప్రయత్నించాడు. ప్రక్క వూళ్లో స్కూలు టీచరుగా చేరాడు. అదీ మానేసి మరో వూళ్లో మరో వుద్యోగానికని వెళ్లాడు. ప్రైవేట్‌గా మరో యం.ఏ. చేశాడు. ఇప్పుడెక్కడున్నాడో తెలియదు.

ఇప్పుడామెకు సమస్య ఆమె కొడుకు. కిరణ్ పెరుగుతూ చాల మొండివాడుగా తయారయ్యాడు. ఫలానా రోడ్డులో దొంగలు తిరుగుతున్నారు గనుక చీకటిపడ్డాక అటువైపు వెళ్లొద్దు అని చెప్తే చీకటిపడ్డాక కిరణ్ ఆ రోడ్డులోకి వెళ్తాడని నిశ్చయంగా చెప్పొచ్చు. కాచి చల్లార్చిన మంచినీళ్లు కూజాలో పెడితే, ఆ ప్రక్కనున్న బిందెలోనివి కాచని నీళ్లే త్రాగుతాడు. ఆమెకు సిగరెట్లు కాల్చేవాళ్లంటే అసహ్యం గనుక సిగరెట్లు కాలుస్తూ రోడ్డులో కన్పిస్తాడు. తిరుగులేని ఆ మొండితనం కక్ష సాధింపులాగా నిరంతర ఘర్షణగా తయారైంది. మూడేళ్ళ క్రితం వాడిని గుంటూరులో ఒక స్కూల్లో హాస్టల్లో చేర్పించింది. ఏడాది క్రితం ఇంట్లో దొంగలు పడి, యింటిని అయ్యవారి నట్టిల్లు చేసినప్పుడు, వాడు కొంచెమైనా బాధపడకపోగా, "నీ యిల్లు, నీ ఖర్మ" అన్న ధోరణిలో మాట్లాడి, "స్టీలు గిన్నెలు సెట్లు పోతే నాలుగు అల్యూమినియం గిన్నెలు కొనుక్కో... బంగారం నగలు తగిలించుకోకపోతే అవమానమా?... కట్టుకోడానికి ఖరీదైన చీరలే అక్కర్లేదు" అన్నాడు. ఆమెకు మిథ్యాడంబరాలు అసహ్యమని వాడికి తెలియదా? వాడి ధోరణి చూసి ఆమె మనస్సు విరిగిపోయింది. 'నాకు బంధాలంటూ ఏమీ మిగల్లేదు' అనుకుంది. ఇప్పుడామె ఒంటరిది. క్రమంగా ఆమె ఆలోచనా ధోరణిలో తీవ్రతా, ధైర్యమూ పలుచనయ్యాయి...

ఈరోజు ఆమె దేనిగురించీ ఆలోచించడం లేదు. గుండెలో అకారణ సంతోషం వ్యాపించి మనస్సు తేలిగ్గా వున్నది.

బస్సు యింకా రాలేదు. ఈ రోజెందుకో బాగా ఆలస్యం అయింది. విద్యాధరి రోడ్డును పరికించి చూచి, బస్సు రావడం లేదని నిర్ధారణ చేసుకుని, స్టాపింగ్ దగ్గరే వున్న కిరాణా కొట్టు దగ్గరకు నడిచింది. గల్లాపెట్టె ముందు కుర్చీలో కూర్చున్న కొట్టు యజమానితో "మా పనిమనిషి వస్తే యాభైకిలోలు ఢిల్లీ భోగాలు - పాతవి - పంపించండి" అని ఆగి, "నూకా, రాళ్లూ, కొత్త బియ్యమూ కలపకుండా" అని నవ్వింది. ఈ పంతులమ్మకు మూడేళ్ల నుంచీ తన కొట్లోనే ఖాతా వున్నా, ఎప్పుడూ సరుకులు బాగా లేవని కసురుకోవడం, చిర్రుబుర్రులూ మాత్రమే చూశాడతను. ఇప్పుడు యీ చిన్న పరిహాసానికి ఆశ్చర్యపోయి, తనూ నవ్వుతూ "అలాగేనండి" అన్నాడు. అతని ముఖంలో కన్పించిన గుర్తింపు వైనం ఆమె యింతకు మునుపెన్నడూ చూడలేదు. 'ముంగి మనిషి నవ్వుతున్నాడేమిటో'

అనుకుంది. ఆమెకు మనస్సు మరి కొంచెం తేలికపడ్డది.

బస్సు వచ్చేసింది. క్రిక్కిరిసిపోయి వచ్చింది. కష్టం మీద విద్యాధరి ఆడవాళ్ల సీట్ల దగ్గరకు చేరుకుంది. ఖాళీ సీటు లేదు. ఆమెది పదిహేను నిముషాల ప్రయాణం. మామూలుగానయితే కూర్చున్నవాళ్లను యింకొంచెం సర్దుకోమని కసిరి చోటు సంపాదించు కుంటుంది కొన్నిసార్లు. వాళ్లు జరక్కపోతే రుసరుసలాడుతూ ముఖం మాడ్చుకుని నిల్చుండి ప్రయాణం చేస్తుంది. ఇవాళ ఆమె నిల్చున్నచోటుకు ప్రక్క సీట్లో ముగ్గురమ్మాయిలు కూర్చున్నారు. ఏ ఆఫీసులోనో ఉద్యోగినులు కాబోలు, రోజూ యిదే బస్సులో పై నుంచీ వస్తారు. కబుర్లతో, నవ్వులతో వాళ్ల లోకం వాళ్లది. తను అడిగినా వాళ్లు కదలరని ఆమెకు అనుభవమే. ఇవాళ ఆమె వాళ్లను ఏమీ అడగలేదు. ముఖంలో చిరచిరలూ లేవు. ఒకచేత్తో బస్సు తాలూకు ఇనుపచువ్వను పట్టుకొని నిల్చుంది, ఆ త్రొక్కిసలాటలో కుదుపులకు వూగుతూ. వాళ్లు ముగ్గురూ కబుర్లాపి, ఆమె ముఖం గమనించి చూసి, కొంచెం సర్దుకుని మూడంగుళాల మేర చోటు చేసి, ఆమెను కూర్చోమన్నారు. అడక్కుండా చూపించిన యీ మంచితనానికి కృతజ్ఞత తెల్పుతున్నట్లు చిన్నగా నవ్వి, కూర్చుంది. 'వీళ్ల ప్రవర్తన రోజుట్లాగా లేదు. ఏమిటో యివాళ్టి విశేషం' అనుకుంది.

ఆలోచనల బరువు లేకుండా తాపీగా బయటికి చూస్తూ కూర్చున్న ఆమెకు మరుపు తెరల్లో నుంచీ ఏదో ముఖ్యమైన విషయం బయటికి రాబోయి మళ్లీ వెనక్కి వెళ్లిపోయింది.

మధ్యాహ్నం సెకండ్ బి.యస్సీ. వాళ్లకి ఫిజిక్స్ క్లాస్ తీసుకుంది. ఈ క్లాసంటేనే ఆమెకు చాల తలనొప్పి. ఒక గంటసేపు విషయం వివరించి చెప్పి, ఆఖరికి ఒక చిన్న ప్రశ్న అడిగితే, ఒక్కొక్కరూ లేచి నిటారుగా, స్తంభాల్లాగా నిలబడతారు తప్ప నోట్లోంచీ ఒక్క ముక్క సమాధానం రాదు! "నా పదహారేళ్ల అనుభవంలో యింత చెత్త క్లాసును చూడలేదు!" అని ప్రతి క్లాసులోనూ వాళ్లకి చెబుతూనే వుంది. ఎంత తిట్టినా వాళ్లకు చదువుకుని బాగుపడదామన్న తెలివి రాలేదు యింతవరకూ. ఇప్పుడా క్లాసుకే వెళ్లింది. ఆమె ఎటెండెన్స్ తీసుకుంటుంటే విద్యార్థినులు గుసగుసలాడుకోవడం, నవ్వుకోవడం కనిపించింది. మామూలుగా మాడుముఖాలు పెట్టుక్కూర్చునేవారు "ఇవాళ ఏం వింత!" అనుకుంది చిన్నగా నవ్వుకుంటూ.

అరగంట పాఠం చెప్పి కుసుమని లేపి ఒక ప్రశ్నను అడిగింది. ఆ అమ్మాయికి చదువులో శ్రద్ధ లేదు. పొగరుబోతు కూడా. నిర్లక్ష్యంగా చూస్తూ సమాధానం చెప్పకుండా నిల్చుంది. విద్యాధరి పరాగ్గా "అర్థం కాలేదా? సరే, కూర్చో" అనేసి పాఠం కొనసాగించింది. కుసుమ కూర్చుని భోరుమని ఏడ్చేసింది. విద్యాధరి ఆశ్చర్యంగా చూసి "ఇప్పుడేమైంది?" అన్నది. కుసుమ కూర్చుని ఏడుస్తూనే, "ఇహనుంచీ చదువుకుంటాను, మేడం!" అన్నది. "సరే, రేపట్నుంచీ ఎంత బాగా సమాధానాలు చెప్తావో చూస్తాను" అన్నది విద్యాధరి. ముందు వరుసలో కూర్చున్న ఆశ ప్రక్కనున్న అమ్మాయితో చిన్నగా "మేడం నవ్వుతుంటే

బాగుందికదే" అనడం విన్పించింది. వీళ్ల ప్రవర్తన కూడా వింతగా వుందివాళ అనుకుంది విద్యాధరి.

సాయంత్రం యిల్లు చేరాక ముఖం కడుక్కుని వచ్చి అద్దం ముందు కూర్చుని బొట్టు పెట్టుకుంటోంది విద్యాధరి. అద్దంలో కన్పిస్తున్న పసిమిరంగు కోలముఖమూ, ఆలోచనలతో బరువెక్కి వాలిన పెద్ద కళ్లూ గమనించకుండా బొట్టుని గుండ్రంగా దిద్దుకుంది. అనుకున్న విషయం తప్పించి వేరే ఏదీ కనబడదామెకు ఎప్పుడూ.

ఆమె మనస్సు దేన్నో వెతుకుతూ వున్నది. మరుపు తెరల్లో దాక్కుని అందకుండా వూరిస్తున్న విషయం ఏదో వుంది... జ్ఞాపకంలోకి రాలేదు. మనస్సు లోతుల్నుంచీ ఎందుకో సంతోషం ఊరి వస్తున్నది. ఇవాళ ప్రతిమనిషీ వింతగా, మంచిగా ప్రవర్తించారు ఆమె పట్ల. కారణం ఏదో వుండే వుంటుంది. తెలుసుకోవాలి. చిత్తము దోవన చిత్తమూ. ఆలోచన దోవన ఆలోచనా సాగిపోతే, జీవితానికి తీరూ తెన్నూ ఎట్లా వస్తుంది?

ఈ ఊహ రాగానే ఉదయం నుంచీ జరిగిన సంఘటనలన్నీ వరుసగా గుర్తు చేసుకుంది... ఉదయం తొమ్మిది గంటలకు కాలింగ్‌బెల్ మ్రోగింది. పోస్ట్‌మేన్ కవరు యిచ్చి వెళ్లాడు. అది కిరణ్ దగ్గర్నుంచీ వచ్చింది. చదవటానికి టైం లేదని తెలిసినా ఆత్రంగా కవరు చించింది. అందులో నుంచి ఒక ఫోటో క్రిందికి జారింది. పొడుగ్గా పలుచగా వుండే పిల్లవాడి రూపు, ఏం జరిగినా నాకు లెఖ్ఖలేదన్న నిర్లక్ష్యపు చూపు. కిరణ్ పసితనం, మొండితనం, ధీమా, ఆమెకు బాగా తెలిసినవాడి నిబ్బరం- ఆ ఫోటోలో నుంచీ ప్రవహించి వచ్చి ఆమెను తాకాయి. ఊహించని సంఘటన. ఆలోచన పనిచెయ్యని ఆ క్షణాన ఒక్క ఆనందరేఖ ఆమె గుండెలో మెరిసి, మనసును వెలిగించింది. మమకారపు తియ్యదనం చిరునవ్వై పెదాల మీదకు ప్రాకింది. వాడిని తలుచుకుంటేనే ఆమె గుండె నిండిపోయింది. ఆచరణలో బెరుకు లేదు, ఆలోచనలో సందిగ్ధత లేదు, మాటలో నాన్చుడు లేదు. 'అంతా నా పోలికే?' అనుకుంది. నవ్వుకుంటూ లెటర్ బాగ్‌లో పడేసుకుని హడావుడిగా బయల్దేరింది కాలేజికి.

అదే యీ వుదయం జరిగిన విషయం. అంతా వరుసగా చిత్రంలో చూస్తున్నట్లు జ్ఞాపకంలోకి వచ్చింది. ఆ ఫోటోతో పాటుగా వచ్చిన ఉత్తరం చదవకుండానే హేండ్‌బాగ్‌లో పెట్టేసింది.

ఆ ఉత్తరం ఆమె యింకా చదవలేదు. వ్యక్తమానసపు వాస్తవాలు యింకా ఆమె అంతరంగాన్ని స్పష్టతలోకి ముక్కలు చెయ్యలేదు. మనసు లోతుల్లోని మమకారపు చోదన యింకా ప్రపంచాన్ని ఏకం చేస్తూనే ఉంది.

ఇప్పుడు చదివి ఆలోచించుకోవలసిన విషయాలుంటాయి అందులో. మనసుని చీకాకులో ముంచివేసే సంగతులుంటవి. 'ఏం వ్రాశాడో' అనుకుంది భారంగా.

ఆ ఉత్తరం ఆమె యింకా చదవలేదు.

★★★